క్లుప్తంగా

రథసప్తమి పూజలు



సూర్య నమస్కారాలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక మెంటేవారి తోటలోని శ్రీ బాల త్రిపుర సుందరీ దేవి అమ్మవారి దేవస్థానంలో రథసప్తమి పురస్కరించుకుని సూర్య నమస్కారాలు, అమ్మవారికి చిక్కుడు కాయలతో ప్రత్యేక అలంకరణ చేశారు. పెంటపాటి బాబిష్‌తో అర్చకులు, వేద పండితులు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా సూర్య నమస్కారాలు నిర్వహించారు. అర్చకుడు కొమ్ము శ్రీనివాస్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మోగల్లులో..

పాలకోడేరు: మోగల్లులోని శ్రీ సూర్య దేవాలయంలో శ్రీ సౌజ్ఞ ఛాయ పద్మనీ ఉష సమేత శ్రీ సూర్యదేవుని కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించి, అన్నసమారాధన చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వెలిచెర్ల శ్రీ గణేష్ భానుమంతుడు, కార్యదర్శి వెలిచెర్ల నాగదత్త శర్మ, అర్చకుడు వాడపల్లి శేషాచార్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

భీమవరం: స్థానిక డీఎన్నార్ కళాశాల ఆవరణలో పాఠశాలల విద్యార్థులకు సంస్కార్ భారతి ఆధ్వర్యాన సూర్య నమస్కారాల పోటీలు నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ సంఘ చాలక్ మంతెన రామచంద్రరాజు, విశ్వ హిందూ పరిషత్ ప్రాంతీయ అధ్యక్షుడు ఒబిలిశెట్టి శ్రీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు

కాళ్ల: కోమటిగుంట పంచాయతీ పరిధిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ బోనం భాగ్యశ్రీ తెలిపారు. గ్రామ పరిధిలోని సూర్యారావుపేటలో పైప్‌లైన్ ఏర్పాటు పనులను శుక్రవారం ప్రారంభించారు. ఇటీవల ఇక్కడ జల్ జీవన్ మిషన్ నిధులు రూ.35 లక్షలతో ఓహెచ్‌ఆర్ నిర్మించారు. దీనిలో భాగంగా ఓహెచ్‌ఆర్‌కు పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె చెప్పారు. పంచాయతీ నిధులు సుమారు రూ.3 లక్షలతో పైప్‌లైన్ వేస్తున్నట్లు తెలిపారు. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం అవుతుందన్నారు. పనులను వైఎస్సార్ సీపీ నాయకుడు బోనం శివ కుమార్ పర్యవేక్షించారు.

వైభవంగా గాజుల ఉత్సవం

కాళ్ల: మండలంలోని కోమటిగుంట గ్రామంలో కొలువైయున్న దుర్గాదేవికి మాఘమాసం రథ సప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం గాజుల ఉత్సవం నిర్వహించారు. అర్చకుడు ఎస్వీ పవన్‌కుమార్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్త ఎరుబండి రామాంజనేయులు, రత్నకుమారి దంపతులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యువతిని మోసగించిన కేసులో ముద్దాయి అరెస్టు

ఉండి: మండలంలోని పాందువ్వ గ్రామంలో ప్రేమ పేరుతో యువతిని మోసగించి పెళ్లికి నిరాకరించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. పాందువ్వ గ్రామానికి చెందిన మట్టా చిట్టిబాబు అనే యువకుడు అదే ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమపేరుతో మోసగించి పెళ్లికి నిరాకరించాడు. దీంతో స్థానికంగా ఉండే పెద్దల సమక్షంలో పరిష్కారానికి ప్రయత్నించినా యువకుడు అంగీకరించకపోవడంతో యువతి ఈనెల 7వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసింది. దిశా యాక్టు కింద పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దీనిలో భాగంగా శుక్రవారం డీఎస్పీ వి.సూర్యనారాయణరెడ్డి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు.

గాంధీజీ కలలకు ప్రతిరూపం

- గ్రామగ్రామానా సచివాలయాలు
- ప్రజల ముంగిటకు పరిపాలన
- జగనన్న పాలనలో విప్లవాత్మక మార్పులు



ఆకివీడు మండలం కుప్పనపూడిలో ప్రారంభోత్సవానికి ముస్తాబైన గ్రామ సచివాలయ, విలేజ్ క్లినిక్, రైతుభరోసా కేంద్రం భవనాలు

ఆకివీడు: గాంధీజీ కలలకు ప్రతిరూపంగా గ్రామ సచివాలయాలు నిలుస్తున్నాయి. ప్రజల ముంగిట పరిపాలన అందించేందుకు, ప్రజా సమస్యల్ని తక్షణమే పరిష్కరించేందుకు, ప్రజలకు పారదర్శక పాలన చేరువ చేసేందుకు సచివాలయాలు ఉపయోగపడుతున్నాయి. పల్లెటూరులు మన భాగ్యసీమలన్నారు పెద్దలు. స్వాతంత్రత్యానంతరం 75 ఏళ్లుగా మన పల్లెలు ప్రగతికి నోచుకోక, ప్రజలకు సేవలందించక ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా ఉన్నాయి. సేవల మాట దేవుడెరుగు, కనీసం గూడు కూడా దొరకని పంచాయతీలు అనేకం ఉన్నాయి. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పంచాయతీలకు సచివాలయ హోదా కల్పించి వాటి అభివృద్ధికి బీజం వేశారు. ఉండి నియోజకవర్గంలోని 72 గ్రామ సచివాలయాలకు పక్కా భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. సచివాలయాల్లో 11 మంది సిబ్బందిని ఏర్పాటు చేసి వారి ద్వారా 500లకు పైగా విస్తృత సేవల్ని ప్రజలకు అందిస్తున్నారు. మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, పనులు మానుకుని కాళ్లు అరిగేలా ఆఫీసులు చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సచివాలయాలు సేవలందిస్తున్నాయి.

42 సచివాలయాల నిర్మాణం పూర్తి

నియోజకవర్గంలో 42 సచివాలయ భవనాలు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. కొన్ని ఇప్పటికే ప్రారంభించారు. మరికొన్ని నిర్మాణం పూర్తి చేసుకుని చివరి దశలో ఉన్నాయి. 12 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, 24 ఆర్బీకేల నిర్మాణం పూర్తి అయింది. వీటిలో కొన్నింటిని ప్రారంభించారు. మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి.

సచివాలయాల్లో సిబ్బంది

సచివాలయాల ద్వారా ప్రజలకు పూర్తి సేవలందించేందుకు 11 మంది సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. వారిని పర్మినెంట్ చేస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేసింది. సచివాలయంలో గ్రామ కార్యదర్శి, వీఆర్వో, ఏఎన్ఎం, సంక్షేమ, ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్‌లు, మహిళా పోలీస్, వెటర్నరీ, వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు, ఎనర్జీ అసిస్టెంట్(లైన్ మెన్) విధులు నిర్వర్తిస్తున్నారు.

మెరుగైన సేవలు



సచివాలయాల ద్వారా మెరుగైన సేవలందిస్తున్నారు. గతంలో కుల, ఆదాయ సర్టిఫికెట్‌లు కావాలంటే మండల ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. వీఆర్వో, ఎమ్మార్వో సంతకాల కోసం తిరిగేవాళ్లం. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థల పట్టా రిజిస్ట్రేషన్ కూడా సచివాలయంలోనే చేయించడం ఎంతో ఆనందంగా ఉంది.

– ఎం.నాగలక్ష్మి, ఆకివీడు.

అభివృద్ధే లక్ష్యంగా..



కుప్పనపూడి గ్రామంలో సచివాలయం, విలేజ్ క్లినిక్, ఆర్బీకే భవన నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేశాం. గ్రామ అభివృద్ధే ధ్యేయంగా సచివాలయ సముదాయాన్ని సుందరంగా తీర్చిదిద్దాం. సచివాలయాల్లో దేశ నాయకుల విగ్రహాల్ని ఏర్పాటు చేసి, పచ్చదనం, పరిశుభ్రత నెలకొల్పుతాం.

– నంద్యాల సీతారామయ్య, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్, కుప్పనపూడి, ఆకివీడు మండలం

ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు



ఇంటి వద్దకే సేవలందిస్తున్న జగనన్న ప్రభుత్వం పేదలకు ఎంతో అండగా ఉంది. వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి సర్టిఫికెట్‌లు, పింఛన్ ఇలా ఏదైనా సేవలందిస్తున్నారు. ఏఎన్ఎంలు వచ్చి ఆరోగ్య సమాచారం తెలుసుకుని డాక్టర్ ద్వారా వైద్యం అందిస్తున్నారు. అడుగు బయటకు వేయకుండా సమస్త సేవలందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– వేగేశ్న కమల, అయిభీమవరం, ఆకివీడు మండలం

వేగంగా సచివాలయాల నిర్మాణం

ఉండి నియోజకవర్గంలో సచివాలయాల నిర్మాణం వేగవంతం చేశాం. 72 సచివాలయాల నిర్మాణం చేపట్టగా ఇప్పటికే 42 పూర్తి అయ్యాయి. 56 విలేజ్ క్లినిక్‌లకు 12 పూర్తి చేయగా, 72 ఆర్బీకేలకు గానూ 24 నిర్మాణం పూర్తయింది. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

– శ్రీనివాసరావు, డీఈ, పంచాయతీ రాజ్, ఆకివీడు సబ్ డివిజన్

భక్తాంజనేయునికి ప్రత్యేక పూజలు



భక్తంజనేయ స్వామివారు

పాలకోడేరు: మండలంలోని పెన్నాడ గ్రామంలో శ్రీ భక్తాంజనేయ స్వామివారి 11వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం విద్యుత్ దీపాలు, చామంతి దండలతో అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెన్నాడ పాలెం వారితో భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు అందజేశారు. అర్చకులు సాంబమూర్తి, ఆదాడ బుల్లియ్య, ఆదాడ మోహనరావు, వైస్ ఎంపీపీ ఆదాడ నరసింహరావు, ఆదాడ నరేష్, ఆదాడ సురేష్, ఆదాడ శ్రీకాంత్, ఆదాడ దుర్గాప్రసాద్, ఆదాడ వేణుగోపాల్, ఆదాడ పూర్ణసాయి, ఆదాడ అప్పారావు, పిడకల బాలాజీ పాల్గొన్నారు.

నేడు యండగండిలో గడప గడపకు మన ప్రభుత్వం

ఉండి: యండగండి సచివాలయం–2 పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యాన మధ్యాహ్నం 2:30 గంటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



వీరవాసరంలో మార్కెట్ యార్డు షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

వీరవాసరం: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం వీరవాసరం, ఉత్తరపాలెంలో సుమారు రూ.2.12 కోట్ల నిధులతో నిర్మించిన పలు నూతన భవనాలను ప్రారంభించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ముందుగా రూ.43.60 లక్షల నిధులతో వీరవాసరం ఎల్లమ్మ చెరువు వద్ద నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని, రూ.23.94 లక్షల నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.40 లక్షల నిధులతో నిర్మించిన సంత మార్కెట్ షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వీరవాసరం పెదపేటలో రూ.60 లక్షల నిధులతో చేపట్టే సీసీ డ్రెయిన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. తర్వాత ఉత్తరపాలెం గ్రామంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించి మీడియాతో మాట్లాడారు. ప్రతి గ్రామంలో కూడా సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణాలను చేపట్టామని, ఇప్పటికే పలు గ్రామాల్లో పనులు పూర్తయ్యాయని తెలిపారు. జల్ జీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేసేందుకు పైప్‌లైన్లు కూడా వేసినట్లు చెప్పారు. 2019 ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని గుర్తు చేశారు. ముఖ్యంగా ఉత్తరపాలెం గ్రామంలో నూతన సచివాలయ భవనాన్ని నిర్మించుకున్నామని, దీని విలువ సుమారు రూ.కోటి ఉంటుందని చెప్పారు. సచివాలయ భవన నిర్మాణానికి రూ.43.60 లక్షల నిధులు ఖర్చు చేస్తే, సెంటు రూ.10 లక్షలు పలికే ఏడు సెంట్ల భూమిని ఇచ్చిన దాతలు చెన్ను సత్యనారాయణ, కోడి వీరన్న, సీహెచ్ వెంకట సత్యనారాయణ, కోడి అప్పారావు, పులి మురళీకృష్ణలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం గ్రామంలోని పలువురు లబ్ధిదారులకు ఆయన ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్ కుమార్, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గొలగాని సత్యనారాయణ, వీరవాసరం సర్పంచ్ చికెలే మంగతాయారు, ఉత్తరపాలెం సర్పంచ్ కోడె వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు నూకల కనకారావు, వేగేశ్న భానువర్మ, కోడి అప్పారావు, వేగేశ్న వర్మ రాజు, బొంతు రమేష్, వీరవల్లి కనక ఉషారాణి, బోను జ్యోత్స్నా లక్ష్మీకుమారి, కోడి వీరన్న, కందుల సురేష్, చవాకుల సత్యనారాయణమూర్తి, కొట్టి కుటుంబరావు, నేతల జ్ఞాన సుందరరాజు, జి.స్వామినాయుడు, అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అందరి సహకారం మరువలేనిది



కలెక్టర్ ప్రశాంతిని అభినందిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమ గోదావరి జిల్లా ఆత్మీయతకు మారుపేరని, ఎటువంటి మంచి కార్యక్రమాలు చేపట్టిన అందరూ సంపూర్ణ సహకారం అందిస్తారని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి అన్నారు. బదిలీపై వెళుతున్న కలెక్టర్ ప్రశాంతిని శ్రీవెంకటేశ్వర స్వామి మందిరం అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి తదితరులు కలిసి ఆత్మీయ సత్కారం చేశారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు చేసే అభివృద్ధి దాతృత్వ కార్యక్రమాలు అద్వితీయమని, భీమవరం జిల్లా కేంద్రం అయినప్పటికీ నుంచి చైతన్య కార్యక్రమాలకు అందరి సహకారం మరువలేనిదని అన్నారు. వెంకటరాజు, రంగసాయి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ప్రశాంతి ప్రధానమంత్రి కార్యక్రమం, 4 సార్లు ముఖ్యమంత్రి కార్యక్రమాలను నిర్విరామంగా నిర్వహించారని, కలెక్టర్ సేవలు వెలకట్ట లేనివని అన్నారు. అనంతరం రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాస్ రాజు, వెంకటరాజు, రంగసాయి సత్కరించి తిరుమల ప్రసాదాన్ని అందజేశారు.

బహుజనుల సంక్షేమం జగన్‌తోనే సాధ్యం

భీమవరం: అంబేడ్కర్ కలలుగన్నా బహుజనుల సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లనే సాకారమవుతుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. శుక్రవారం భీమవరంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ ఆసరా మహిళలకు భరోసా కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కుల, మత, వర్గ బేధాలు లేకుండా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించారని కొనియాడారు. టీడీపీ, జనసేన నాయకులు ప్రభుత్వంపై ఎటువంటి ఆరోపణలు చేసిన ప్రజలు నమ్మే స్థితిలో లేరని మంగరాజు స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు జి చంద్రశేఖర్, సునీల్ బాబు, బి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలుపై కేంద్ర బృందం పరిశీలన



కోలమూరులో గ్రామ సచివాలయాన్ని సందర్శించిన కేంద్ర బృందం



గొల్లవానితిప్ప పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీస్తున్న కేంద్ర బృందం

ఉండి: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించేందుకు శుక్రవారం ఉండి, కోలమూరు గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటించింది. జల్ జీవన్, స్వచ్ఛభారత్ మిషన్‌లలో భాగంగా జరుగుతున్న కార్యక్రమాలను బృందం సభ్యులు రామ్ సేన్ నేగీ, రఘవేందర్ స్థానిక అధికారులతో కలసి పరిశీలించారు. ఆయా గ్రామాల్లో జల్ జీవన్ పథకం ద్వారా చేపట్టిన పనులు, వాటర్ శానిటేషన్ కమిటీ సభ్యులను రక్షిత తాగునీటి నాణ్యత, పరీక్షా విధానం ప్రాముఖ్యతపై ఆరా తీశారు. తాగునీటిని స్వయంగా పరీక్షించారు. ఆర్‌డబ్ల్యూఎస్ స్కీమ్, స్కూల్స్, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, తాగునీరు, మరుగుదొడ్లు, వాటి పరిశుభ్రతను పరిశీలించారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తున్నదీ లేనిదీ కొన్ని ఇళ్లకు వెళ్ళి ఆరా తీశారు. కోలమూరులో గ్రామ సచివాలయ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కమతం సౌజన్య బెనర్జీ, నడింపల్లి సత్యవతి, నడింపల్లి రామకృష్ణంరాజు, అధికారులు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఏఎస్‌పి రామస్వామి, ఎంపీడీవో ఎస్.రవీంద్ర, ఈవోపీఆర్‌డీ ఎ.కొండలరావు, ఏఈ బి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు కె.గోపాలకృష్ణ, ఎస్.శంకరం జేజేఎం కో ఆర్డినేటర్‌లు, ల్యాబ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరం అర్బన్: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించేందుకు శుక్రవారం భీమవరం మండలంలోని గొల్లవానితిప్పలో కొప్పర్తి వీరాస్వామి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర బృందం పరిశీలించింది. డాక్టర్ ఎమ్ఎస్ సౌమ్య మహంతి నేతృత్వంలో సభ్యులు పీహెచ్‌సీని పర్యవేక్షించి రోగులకు అందిస్తున్న చికిత్స విధానం, ఏయే వైద్య పరికరాలు ఉన్నాయో ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు ప్రితీష్ సూర్యకాంత్ లెజెడె, జిల్లా క్వాలిటీ మెడికల్ ఆఫీసర్ తోటి అనిత, తుందుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారిని ఎ. అరుణరాణి, ఆశా వర్కర్లు తదితరులు ఉన్నారు.

19న వలంటీర్లకు అవార్డులు



సేవా వజ్రకు ఎంపికైన పెచ్చెట్టి సత్యనారాయణ



సేవా వజ్రకు ఎంపికైన దంపనబోయిన లక్ష్మీశైలజ



సేవా రత్నకు ఎంపికైన పెన్మత్స దివ్య

పాలకోడేరు: విశిష్ట సేవలు అందించిన గ్రామ వలంటీర్లను ఈనెల 19వ తేదీన పాలకోడేరు మండల సమాఖ్య భవనంలో సన్మానిస్తున్నట్లు ఎంపీడీవో టి.అనూహ్య తెలిపారు. సేవా వజ్ర అవార్డుకు పాలకోడేరు సచివాలయం 2 పరిధిలో ఇద్దరు,, సేవా రత్న అవార్డుకు శృంగవృక్షం సచివాలయం 1, 3 పరిధిలో ఒక్కొక్కరు, గొల్లలకోడేరు, పెన్నాడ 2 పాలకోడేరు 2 సచివాలయాలకు చెందిన ఒక్కొక్కరు చొప్పున ఎంపిక అయ్యారని మిగిలిన వారిని సేవా మిత్రులుగా ఎంపిక చేసినట్లు ఎంపీడీవో చెప్పారు. సేవా వజ్ర అవార్డుకు ఎంపికైన వారిని రూ.45 వేలు నగదు, మెమెంటో, ప్రశంసా పత్రంతో, సేవా రత్న అవార్డుకు ఎంపికైన వారిని రూ.30 వేలు నగదు, మెమెంటో, ప్రశంసా పత్రంతో, సేవా మిత్రలకు రూ.15 వేలు నగదుతో సత్కరిస్తారని, ముఖ్య అతిథిగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు హాజరవుతారని ఎంపీడీవో తెలిపారు

అవార్డులకు ఎంపికైన వారు వీరే..

సేవా వజ్ర అవార్డుకు పాలకోడేరు సచివాలయం 2కు చెందిన పెచ్చెట్టి సత్యనారాయణ, దంపనబోయిన లక్ష్మీశైలజ, సేవా రత్న అవార్డుకు పెన్నాడ 2కు చెందిన ఆరేపల్లి వరప్రసాద్, పాలకోడేరు సచివాలయం 2కు చెందిన పెన్మత్స దివ్య, గొల్లలకోడేరుకు చెందిన గోడి సన్నీబాబు, శృంగవృక్షం సచివాలయం 1కు చెందిన చెలంకూరి లీలా సత్య సరోజిని, శృంగవృక్షం సచివాలయం 3కు చెందిన బొక్కా సోమేశ్వరి, మిగిలిన 400 మంది వలంటీర్లు సేవా మిత్ర అవార్డులకు ఎంపికయ్యారు.

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): రోడ్డు భద్రతలను నియమాలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని భీమవరం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సీహెచ్ రమణ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, రవాణా శాఖ ఆధ్వర్యంలో డిఎన్నార్ వాకర్స్ అసోసియేషన్ 100 మంది సభ్యులతో 35వ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా 2కే వాక్, సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలకు తల్లిదండ్రులు మోటార్ సైకిళ్లు ఇవ్వరాదని, మద్యం తాగి వాహనం నడపడం నేరమని, రవాణా శాఖ అధికారులు 24 గంటలు పహారా చేస్తున్నారని తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లారాం సీతారాం రాజు, కొప్పినిడి సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ రవాణ శాఖ అమలు చేస్తున్న నిబంధనలు మన రక్షణ కోసమేనని, వాహనాలు అతి జాగ్రత్తగా నడపాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. అనంతరం 2 కే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి సుబ్బలక్ష్మి, చౌదరి, పి మణి బాబు, ఎండి బషీర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవి రమణ తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ



మావుళ్లమ్మకు బంగారం సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మవారికి పట్టణానికి చెందిన పి.శివరామవర్మ– శిరీష దంపతులు 8 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు. ముందుగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు ఫార్మసిస్టులకు శిక్షణ

భీమవరం: స్థానిక బీవీ రాజు ఫౌండేషన్ శ్రీ విష్ణు ఫార్మసీ కళాశాలలో శనివారం ఏపీ ఫార్మసీ కౌన్సిల్ ఆధ్వర్యాన రిజిస్ట్రర్డ్ ఫార్మసిస్టులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.నటరాజ్ తెలిపారు. శిక్షణకు జిల్లాలోని 120 మంది ఫార్మసిస్టులు పేర్లు నమోదు చేసుకున్నారు. ఏపీ ఫార్మసీ కౌన్సిల్ ఈసీ సభ్యుడు డాక్టర్ ప్రసాదరెడ్డి, కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విలియం క్యారీ, సమన్వయకర్త పులిపాటి సౌజన్య హాజరవుతారని తెలిపారు.